# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ నివాళులర్పించారు.
- ❖ రాష్ట్ర పోలీసు శాఖలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని హోం మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు.
- ❖ నరసాపురం - చెన్నై వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ప్రారంభించారు.
- ❖ తిరుమలలో వైకుంఠద్వార దర్శనాలకు విస్తృతంగా ఏర్పాట్లు చేశామని టిటిడి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు తెలిపారు.
- ❖ ఈశాన్య, తూర్పు గాలులు ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు రోజుల పాటు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

========================

అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ నివాళులర్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఈరోజు ముఖ్యమంత్రి స్పందిస్తూ.. తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఉండాలనే దృఢ నిశ్చయంతో పోరాడిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ప్రాణాలను కూడా లెక్క చేయకుండా ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడారని అన్నారు. మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడిచి సమసమాజ స్థాపన కోసం పొట్టి శ్రీరాములు తపించారని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు. లక్ష్య సాధన కోసం అమరజీవి చేసిన దీక్షను భావితరాలు తెలుసుకోవాలని ఉపముఖ్యమంత్రి అన్నారు.

========================

రాష్ట్ర పోలీసు శాఖలో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, దీనిలో భాగంగా సుమారు వెయ్యి కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను సిద్ధం చేశామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కళ్యాణం శివ శ్రీనివాస్ అమరావతిలో ఈ రోజు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అనిత మాట్లాడుతూ.. ఇప్పటికే 509 కోట్ల రూపాయలతో పలు పోలీసు భవనాల నిర్మాణాలు కొనసాగుతున్నాయని తెలిపారు. త్వరలో 179 కోట్ల రూపాయలతో కొత్త భవన నిర్మాణాలు, 412 కోట్ల రూపాయలతో గ్రేహౌండ్స్ భవనాల నిర్మాణం ప్రారంభించనున్నామన్నారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో కార్యాలయాలు లేవని, వాటి నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని మంత్రి అనిత పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

========================

రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో ఈరోజు పర్యటించి పలువురు కేంద్ర మంత్రులను కలుసుకున్నారు. కేంద్ర స్కిల్ డెవలప్ మెంట్ శాఖ మంత్రి జయంత్ చౌదరితో సమావేశమైన లోకేశ్ విశాఖపట్నంలో జాతీయ నైపుణ్య శిక్షణ సంస్థ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విశాఖ జిల్లా పెదగంట్యాడలోని 5 ఎకరాల స్థలాన్ని జాతీయ నైపుణ్య శిక్షణ సంస్థ స్థాపన కోసం రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా గుర్తించిన విషయాన్ని జయంత్ చౌదరి దృష్టికి తీసుకువచ్చారు. కేంద్ర సమాచార, ప్రసార, ఎలక్ట్రానిక్స్, రైల్వే, ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో మంత్రి నారా లోకేశ్ సమావేశం అయ్యారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే నైపుణ్య గణనకు కేంద్ర సహాయం కావాలని మంత్రి కోరారు. దీనికి కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో యువ పారిశ్రామికవేత్తలు, ఔత్సాహిక వ్యవస్థాపకులకు అద్భుతమైన వేదికగా ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కు MeitY స్టార్టప్ హబ్ మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఇండియా ఏఐ మిషన్ కింద రాష్ట్రంలో ఏఐ విస్తృతికి దోహదపడాలని కోరారు.

========================

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈనెల 17వ తేదీన తిరుపతికి రానున్నారు. ఉదయం 10 గంటల 25 నిమిషాలకు మైసూరు నుంచి తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకుని హెలికాప్టర్ లో తమిళనాడు రాష్ట్రం వేలూరులోని గోల్డెన్ టెంపుల్ ను రాష్ట్రపతి దర్శించనున్నారు. రాష్ట్రపతికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ స్వాగతం పలుకనున్నారు. దర్శనానంతరం మధ్యాహ్నం 3 గంటల 30 నిమిషాలకి తిరుపతి విమానాశ్రయం చేరుకుని ప్రత్యేక విమానంలో హైదరాబాద్ కు బయలుదేరి వెళ్ళనున్నారు.

విరామం

========================

తిరుమలలో వైకుంఠద్వార దర్శనాలకు గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని విస్తృతంగా ఏర్పాట్లు చేశామని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఛైర్మన్ బి.ఆర్.నాయుడు తెలిపారు. తిరుమలలో పాత్రికేయులతో ఈరోజు టిటిడి ఛైర్మన్ మాట్లాడుతూ... ఈనెల 30 నుండి జనవరి 8వ తేదీ వరకు శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వైకుంఠద్వార దర్శనాలు ఉంటాయని, మొదటి మూడు రోజులకు ఎలక్ట్రానిక్ లక్కీడిప్ ద్వారా టోకన్లు కేటాయించామన్నారు. మిగిలిన 7 రోజులు సామాన్య భక్తులు ఎలాంటి టోకన్లు లేకపోయినా సర్వదర్శనం ద్వారా వైకుంఠద్వార దర్శనం కల్పిస్తామన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని బి.ఆర్.నాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

========================

నరసాపురం- చెన్నై వందేభారత్ ఎక్స్ ప్రెస్ ను నరసాపురం స్టేషన్ నుంచి కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఈ రోజు జెండా ఊపి ప్రారంభించారు. చెన్నై సెంట్రల్-విజయవాడ మధ్య నడుస్తున్న వందేభారత్ రైలును నరసాపురం వరకు పొడిగిస్తూ.. రైల్వే బోర్డు ఇటీవల ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... దేశంలోనే మొదటిసారిగా మారుమూల ప్రాంతాలకు కూడా వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైలును ప్రారంభించిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదే అన్నారు.

========================

అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జీవితం అందరికీ ఆదర్శమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ గ్రామంలో ఆయన చిత్రపటానికి మంత్రి ఈరోజు నివాళి అర్పించారు. భాషాప్రయుక్త రాష్ట్రాల సాధనకై ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని మంత్రి కొనియాడారు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు.

========================

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర, దక్షిణ కోస్తాంధ్రలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం మెటిరోలజిస్ట్ ఎం. వెంకట్రావు తెలిపారు. రానున్న 2 రోజుల పాటు ఒకటి లేదా రెండు చోట్ల సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల సెంటీగ్రేడ్ తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వివరించారు.

========================

ఇంధన పొదుపు ద్వారా రాష్ట్ర ప్రగతికి దోహదపడాలని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ప్రజలని కోరారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో విజయనగరం పట్టణంలో ఈరోజు నిర్వహించిన అవగాహనా ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇంధనాన్ని ఎంత పొదుపు చేస్తే.. అంత అదనంగా ఉత్పత్తి చేసినట్టేనని అన్నారు. నిత్యం విద్యుత్ డిమాండ్ పెరుగుతోందని, ప్రతీ ఒక్కరూ విద్యుత్ ఆదాపై దృష్టి పెట్టాల్సిన అవసరం వుందని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ అన్నారు. అమలాపురం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన జాతీయ ఇందన పొదుపు వారోత్సవాలలో ఆయన మాట్లాడుతూ... విద్యుత్‌ను ఆదా చేసే 5 స్టార్ పరికరాలను వినియోగించాలని, అవసరమైనప్పుడే విద్యుత్ ఉపకరణాలను వినియోగించాలని సూచించారు.

========================
========================